క్లుప్తంగా

తెల్లవారుజామున పారిశుధ్య పనుల పరిశీలన

సిబ్బందికి పలు సూచనలు చేసిన కమిషనర్ రాము



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రాము

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన బి.రాము పట్టణాన్ని సోమవారం తెల్లవారుజామున పరిశీలించారు. వార్డు పారిశుధ్య సూపర్‌వైజర్లు, సచివాలయం శానిటరీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికుల పనులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని పారిశుద్ధ్య పరిస్థితులను, సిబ్బంది పనితీరును పారిశుధ్య నిర్వహణ తనిఖీదారు లావణ్య వివరించారు. ప్రతి సచివాలయ పరిధిలోని పారిశుధ్య పనులను కార్యదర్శులు సకాలంలో పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పరిసరాల శుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం



గొల్లపాలెంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

కాజులూరు: పరిసరాల శుభ్రతతోనే ఆ గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులు ఆధారపడి ఉంటాయని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత, గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక అన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించి పరిసరాల శుభ్రత, వ్యాధుల నిర్మూలన అనే అంశంపై సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చైనీయుల ఆహారపు అలవాట్లు, పరిసరాల శుభ్రత లోపాలు కారణంగానే కరోనా విజృంభణకు కారణమయిందన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించటం, విరివిగా మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణ జరిగి ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: జగనన్న ఆరోగ్యసురక్ష–2లో భాగంగా మంగళవారం ఆర్యావటంలో జరుగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.సౌజన్య అన్నారు. సోమవారం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ వనుం సూర్యావతి అధ్యక్షతన జరిగే ఈ శిబిరంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. బీపీ, సుగర్, పలు దీర్ఘకాలిక వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మరింత మెరుగైన చికిత్స అవసరమని గుర్తించిన వారికి వైఎస్సార్ ఆరోగ్య పథకం ద్వారా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించి రోగులకు మందులు ఉచితంగా ఇస్తారన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్‌ను అందజేస్తున్న కె.శ్రీనివాస్ దంపతులు

రాయవరం: పసలపూడి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు దాతలు ప్రింటర్ బహూకరించారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ సబ్ కలెక్టరు పీఎస్ఏ రమాదేవి గతంలో కంప్యూటర్‌ను అందజేయగా, ఇప్పుడు ప్రింటర్‌ను అందజేశారు. ప్రింటర్‌ను ఆమె తరుపున రిటైర్డ్ ఆర్మీ అధికారి కె.శ్రీనివాస్ దంపతులు పాఠశాల హెచ్‌ఎం కోరుమిల్లి వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్నపై హర్షం

కాజులూరు: బీజేపీ సీనియర్ నాయకుడు లాల్ కృష్ణ అద్వానీని దేశంలో అత్యంత గౌరవప్రదమైన భారతరత్న వరించడంపై కాజులూరు మండల గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కుయ్యేరులో పార్టీ మండల యువమోర్చ అధ్యక్షుడు నిమ్మన రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ద్వారా ప్రజా జీవితంలోకి అడుగు పెట్టిన అద్వానీ భారతీయ జనసంఘ్ నుంచి దేశం కోసం కీలకమైన నిర్ణయాలు తీసుకుంటూ శక్తివంతమైన నాయకుడిగా ఎదిగారన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరగడంలో అద్వానీ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. నియోజకవర్గ స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ దేవు పట్టాభి, మండల కన్వీనర్ పినిపే చంద్ర, మండల కార్యదర్శులు పోలిశెట్టి శ్రీనివాస్, పుణ్యమంతుల శివాజీ తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

మూషికం.. వరికి నష్టకారకం

- పిలక దశలో రబీ వరి పంట
- పైరుపై ఎలుకల దాడి ప్రారంభం
- 7, 8 తేదీల్లో బ్రోమోడయోలిన్ మందు పంపిణీకి ఏర్పాట్లు
- ఈ ఏడాది ముందుగానే నష్ట నివారణకు సిద్ధం

రాయవరం: రైతులు కష్టనష్టాలను భరిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి పరంగా వచ్చే నష్టాలతో పాటు ఎలుకలు కూడా అన్నదాతలకు కష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఎలుక తినేదాని కన్నా ఎనిమిది రెట్లు ధాన్యాన్ని పాడు చేస్తూ నష్టం కలుగజేస్తున్నాయి. ఈ ఏడాది కూడా వరిపైరుపై ఎలుకలు దాడి చేయడం ప్రారంభించాయి. ప్రస్తుతం వరి పిలక దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో వరి పైరు చిరుపొట్ట దశకు చేరుకుంటుంది. ఎలుకల దాడి కారణంగా రైతులు ఏటా పంట దిగుబడిని కోల్పోతున్నారు. ఎలుకల దాడి నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం కూడా ఏటా ఖరీఫ్, రబీల్లో బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఈ ఏడాది ప్రభుత్వం అన్నదాతలను నష్టాల నుంచి కాపాడాలనే ఉద్దేశంతో చిరుపొట్ట దశలోనే ఎలుకల నివారణకు నడుం బిగించింది.

క్లస్టర్ పరిధిలో...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల పరిధిలో 98 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. రబీలో 95 శాతం మేర వెదజల్లు సాగును చేపట్టారు. మిగిలిన ఐదు శాతం మాత్రం సాధారణ పద్ధతిలో వరినాట్లు వేశారు. రైతులు అధిక శాతం ఎంటీయూ 3626(బొండాలు) రకాన్ని సాగు చేయగా, తక్కువ విస్తీర్ణంలో 1001, 1010 తదితర రకాలను సాగు చేశారు.



పొలంలో ఎలుకలకు పొగపెడుతున్న రైతు

వరి పంటకు తీవ్ర నష్టం

చిలుకలు జామపళ్లను కొరికినట్లుగా ఎలుకలు వరిదుబ్బులను కొరికి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఎలుకలను అదుపు చేయడం కోసం రైతులు పలు మార్గాలను చేపడుతున్నారు. ప్రస్తుతం వరి పంట దుబ్బు కట్టే దశ నుంచి పిలక దశకు చేరుకుంది. ఈ దశలోనే ఎలుక కొట్టుడు ఎక్కువగా ఉంటుంది. రైతులు ఎలుకలను బుట్టల సహాయంతో, పొగపెట్టే విధానంలో మట్టుబెట్టే చర్యలు చేపడుతున్నారు. ఎలుకల బెడద ఎక్కువగా ఉండడంతో ఎలుకలు పట్టేవారికి డిమాండ్ పెరిగింది. ఒక్కో ఎలుకకు రూ.50 వరకూ తీసుకుంటున్నారు. ఇలా ఎకరానికి సుమారు వెయ్యి నుంచి రూ.2 వేల వరకు ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వరి పంట చిరుపొట్ట దశలో దుబ్బు తీపెక్కుతుంది. ఆ సమయంలో ఎలుకలు వరిపంటను మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి. అందుకే ఏటా ప్రభుత్వం చిరుపొట్ట దశకు ముందుగానే ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తోంది.

పిలక దశలోనే సరఫరా



ప్రస్తుతం ఎలుకల ఉధృతి తక్కువగానే ఉంది. అయినప్పటికీ ప్రారంభంలోనే ఎలుకల నివారణకు ప్రభుత్వం పూనుకుంది. గతానికి భిన్నంగా ఈ ఏడాది పిలకదశలోనే బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేయనుంది. ఈ నెల 7, 8 తేదీల్లో ఉచితంగా అందజేసే బ్రోమోడయోలిన్ మందును సరఫరాకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రైతులందరూ ఒకేసారి మందును పొట్లాలుగా చుట్టి వేయడం వల్ల ఆశించిన ఫలితం వస్తుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ఉచితంగా సరఫరా..

వ్యవసాయశాఖ ఖరీఫ్, రబీ సీజన్లో ఎలుకల నివారణకు బ్రోమోడయెలిన్ మందును రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. గత ఖరీఫ్‌లో ఎలుకల నివారణ మందును సామూహికంగా రైతులకు పంపిణీ చేశారు. ప్రస్తుత రబీలో కూడా ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందును సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టడం వలన ప్రయోజనం ఉంటుందని అధికారులు రైతులకు చెప్పడమే కాకుండా, ప్రతి సీజన్‌లో సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుత రబీలో ఎలుకల దాడి ఉధృతమవుతున్న దశలో సామూహిక ఎలుకల నివారణ చేపట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

7, 8 తేదీల్లో మందు పంపిణీ

జిల్లా అంతటా ఒకేసారి ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును వ్యవసాయ శాఖ సరఫరా చేస్తుంది. అందులో భాగంగా క్లస్టర్ పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. క్లస్టర్ పరిధిలోని ఆయా మండలాల్లో 27,700 మంది రైతులకు ఆయా పంచాయతీల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉచితంగా ఎలుకల నివారణ మందును పంపిణీ చేయనున్నారు. బ్రోమోడయోలిన్ మందును ఎరతో కలిపి రైతులకు వ్యవసాయ శాఖ ఉచితంగా అందజేయనుంది.

పేదలకు భరోసానిచ్చే ప్రభుత్వం



వైఎస్సార్ నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వంలో కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి ప్రజలకు భరోసాను కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ నగర్, రాజబాబునగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వం ద్వారా పొందిన పథకాల లబ్ధిని వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పరిపాలనలో ఎన్నో వ్యవస్థలున్నప్పటికీ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన పారదర్శక పాలన అందుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రూపొందించారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అవినీతి లేని పాలనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు తాగరు మూర్తి, సత్తి శంకర్‌రెడ్డి చుట్టుగుళ్ల ఏసయ్య, కౌన్సిలర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేష్టలు హాస్యాస్పదం

టీడీపీలో చేరికల పేరుతో అవాస్తవాలు ప్రచారం

కపిలేశ్వరపురం: టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేష్టలు హాస్యాస్పదంగా ఉంటున్నాయని, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో టీడీపీ పాత కార్యకర్తలకే కొత్త పసుపు కండువాలు కప్పుతూ వారిని వైఎస్సార్ సీపీ నాయకులుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఏడిద గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. గ్రామంలో సోమవారం వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, చేనేత విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేతా వెంకటేశ్వరరావు మాట్లాడారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే వేగుళ్ల ఏడిద గ్రామాభివృద్ధికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు ప్రజల ముందుకు వచ్చి, డబ్బులను వెదజల్లుతూ ఎన్నికల రాజకీయం చేయడం ఎమ్మెల్యే వేగుళ్ళకు అలవాటు అన్నారు. నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతికి చెందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ లబ్ధిని చేకూర్చారని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు కాలర్ ఎగరేసుకుని న్యాయం చేశామన్న గౌరవంతో ప్రజల ముందుకు వెళ్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి సానుకూలత ఉన్న నేపథ్యంలో పార్టీని వీడాల్సిన అవసరం ఏ ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్తకు లేదన్నారు. 15 ఏళ్ల ఎమ్మెల్యే పదవీ కాలంలో ఎమ్మెల్యే వేగుళ్ల చేయలేని నియోజకవర్గ అభివృద్ధిని ప్రస్తుత వైఎస్సార్ సీపీ హయాంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేసి చూపించారన్నారు. ఏడిద గ్రామంలో ఎమ్మెల్సీ తోట తాలూకు ప్రగతిని చూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 15 ఏళ్లలో తాను ఏ అభివృద్ధి చేశారో, మరో సారి గెలిపిస్తే ఏం చేస్తారో ప్రజలకు వివరించాల్సిన ఎమ్మెల్యే వేగుళ్ల తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు వాసిరెడ్డి అర్జున్, కొండేటి కాశీకృష్ణ కుమార్, బండారు కృష్ణ, మాజీ ఎంపీపీ ఉడతా ప్రభాకరరావు, ఏఎంసీ డైరెక్టర్ ముగ్గుళ్ల పార్థకృష్ణ, సేవాదల్ కన్వీనర్ తేలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఏడిదలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

రాయవరం: పాఠశాల వాహనాలను నడిపే డ్రైవర్లు కచ్చితంగా రహదారి నిబంధనలు పాటించాలని రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. రాయవరంలో సోమవారం రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పాఠశాల వాహనాలను నడిపే బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. పాఠశాల వాహనాలను నడిపే బస్సు డ్రైవర్లు రవాణా శాఖ నియమ నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. బస్సును తీసే ముందు కండిషన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో చిన్నారుల జీవితాలతో ఆటలాడుకోవద్దని హెచ్చరించారు. పాఠశాల విద్యార్థులు కూడా పాటించాల్సిన రహదారి నిబంధనలను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రపురం రూరల్: విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో కీలకమని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఎంఈఓ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పరీక్షలు అంటే భయపడకుండా ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు సూచనల మేరకు కష్టపడి చదువుకుని మంచి మార్కుల సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని వీవీ రత్న పద్మావతి మాట్లాడుతూ పాఠశాలలోని ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందిస్తారని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆరవ విస్సు, లక్ష్మీనారాయణ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

చేతిరాత పోటీల్లో లక్ష్మశ్రీకి ప్రథమస్థానం

రావులపాలెం: ఆల్ ఇండియా స్థాయిలో విజ్ కిడ్స్ కార్నివాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ హ్యాండ్ రైటింగ్ కాంపిటేషన్ అండర్ 6–8 సంవత్సరాల కేటగిరీలో రావులపాలేనికి చెందిన కొవ్వూరి లక్ష్మశ్రీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తల్లిదండ్రులు కేవీవీఎస్ సూర్యనారాయణ రెడ్డి, ఆది మహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఈనెల నాలుగో తేదీన పూణే సింబయోసిస్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన కిడ్స్ ప్రీమియర్ లీగ్ సెషన్–2 గ్రాండ్ ఫైనల్‌లో చేతిరాత విభాగంలో లక్ష్మశ్రీ ప్రథమ స్థానంతో నిలిచిందన్నారు. ఇండియా వైడ్ 50 సిటీలకు సంబంధించి 200 మంది విద్యార్థులు ఫైనల్‌కు రాగా తమ కుమార్తె ప్రథమ స్థానం దక్కించుకుందన్నారు. మరాఠీ నటుడు సౌరబ్ గోకులే చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు రూ.5 వేల నగదు అందుకుందన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులను పలువురు అభినందించారు.



మరాఠీ నటుడు సౌరభ్ గోకులే చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న లక్ష్మశ్రీ

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



తహసీల్దార్ రవీంద్రనాథ్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికిన వీఆర్వోలు



తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కిషన్‌రావు

కె.గంగవరం: మండల తహసీల్దార్‌గా రవీంద్రనాథ్ నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వైద్యనాథ్‌శర్మ బదిలీపై అమలాపురం కలెక్టరేట్‌కు వెళ్లారు. ఏలూరు జిల్లా గోపాలపురం నుంచి రవీంద్రనాథ్ బదిలీపై కె.గంగవరం వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుటానని చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్‌ను మండలంలోని పలు గ్రామాల వీఆర్వోలు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించారు.

రాయవరం: మండల తహసీల్దారుగా ఆర్‌వీ కిషన్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా భీమవరం జిల్లా పోడూరు మండలం నుంచి కిషన్‌రావు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బదిలీపై రాగా, రాయవరం మండలానికి కిషన్‌రావును తహసీల్దారుగా నియమించారు. తహసీల్దారును డిప్యూటీ తహసీల్దారు విజయరేఖ, ఆర్ఐ పంపన రామారావు, మండల సర్వేయర్ సుజాత శుభాకాంక్షలు తెలిపారు.

భానుని కిరణాలను లెక్క చేయని మంచు తెరలు



ద్రాక్షారామలో ఉదయం 8 గంటలకు మంచు తెర మాటున సూర్యుడు

రామచంద్రపురం రూరల్: ప్రస్తుతం మంచు దట్టంగా పడుతోంది. ఉదయం 8 గంటల వరకు పక్క మనిషి కనిపించనంతగా మంచు వర్షంగా కురుస్తోంది. భానుని కిరణాలు తాకి మంచు కరుగుతుంది. కానీ సూర్యుడు వచ్చినా కూడా మంచు తెరలు లెక్క చేయకుండా కురుస్తూనే ఉన్నాయి.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల పంచాయతీ శివారు నరజాడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. నరజాడ నుంచి కూళ్ల వరకు గత కొన్నేళ్లుగా రహదారి సక్రమంగా లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సీసీ రోడ్డు నిర్మాణానికి ఇటీవల సుమారు రూ.51 లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టూరి చిన్ని తదితరులు ప్రత్యేక పూజలు చేసి సోమవారం పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలందరికీ సంక్షేమం అందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని దీనికి ప్రతి ఒక్కరూ తమ మద్దతు తెలపాలని కోరారు. గ్రామ నాయకులు దుర్గారావు, శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మద్యం తరలిస్తున్న వ్యక్తులు

రామచంద్రపురం రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ద్రాక్షారామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వేగాయమ్మపేట వద్ద సోమవారం గస్తీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు యానం నుంచి అక్రమంగా మద్యం తీసుకుని వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ఒకరు జంగారెడ్డిగూడెంకు చెందిన షేక్ షరీఫ్‌గాను, మండపేట మండలం ద్వారంపూడికి చెందిన వల్లేపల్లి కిషోర్‌లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర విలేకరులకు తెలిపారు.

పడమర ఖండ్రిక దళిత నాయకుడి మృతి

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రిక గ్రామానికి చెందిన సీనియర్ దళిత నాయకుడు పల్లి మసేను(65) సోమవారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన గతంలో గ్రామ పీఏసీఎస్ డైరెక్టర్ గానూ, దళిత సంఘం నాయకుడు గానూ సేవలందించారు. ఆయన మృతికి సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ పెద్దిరెడ్డి శేషారత్నం, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కవల శ్రీను, సచివాలయాల మండల కన్వీనర్ పాలింగి శ్రీను, సేవాదళ్ కన్వీనర్ పాలింగి కిశోర్, నేల సూర్యకుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

చిల్లర నాణేలతో ఆంజనేయ స్వామికి తులాభారం



చిల్లర నాణేలతో తులాభారం వేసి ఆంజనేయ స్వామికి మొక్కు చెల్లిస్తున్న భక్తుడు

పి.గన్నవరం: నరేంద్రపురంలోని అభయాంజనేయ స్వామి వారి 31వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన చెల్లి కిషోర్‌బాబు అనే యువకుడు చిల్లర నాణేలతో తులాభారం వేసి స్వామికి తన మొక్కును చెల్లించుకున్నారు. మొత్తం 80 కిలోల నాణేలను స్వామివారికి సమర్పించారు. ఈసందర్భంగా అతడి కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి వార్షిక మహోత్సవాలు మంగళవారంతో ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్ మానికిరెడ్డి లక్ష్మణరావు తెలిపారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సప్తాహం సందర్భంగా వారం రోజుల పాటు భజన కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులకు సత్కరిస్తామని, కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయంపై ఫిర్యాదు

పి.గన్నవరం: తన బ్యాంకు ఖాతా నుంచి ఏఈపీఎస్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు రూ.19,800 కాజేయడంతో మానేపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మురమళ్ల అంజిబాబు సోమవారం పి.గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజిబాబు కాట్రేనికోన మండలం పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన జగ్గన్నపేటలోని బ్యాంకులో శాలరీ అకౌంటును కలిగి ఉన్నారు. ఆ ఖాతా నుంచి ఈనెల ఒకటిన రూ.9900లు 4న రూ.9900లను ఏఈపీఎస్ ద్వారా కాజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అంజిబాబు విలేకరులకు తెలిపారు.